క్లుప్తంగా

గురవారెడ్డికి ఘన నివాళి



గురవారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పామూరు: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోలు గురవారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సోమవారం మృతుని నివాసంలో జరిగిన దశదిన కర్మకు హాజరైన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డిలతో పాటు పలువురు మృతుడు పోలు గురవారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ్ శ్రీనివాసులు, పోలు బాలురెడ్డి, కోటపాటి రమణారెడ్డి, పోలు మల్లికార్జునరెడ్డి పలువురు ఉన్నారు.

841 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో 841 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 990 బేళ్లను వేలానికి తీసుకురాగా 841 బేళ్లను కొనుగోలు చేసి 149 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.110 పలకగా సరాసరి ధర రూ.288.70 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆలయ భూముల్లో రంగు రాళ్ల వేట



పామూరులోని ఆలయ భూముల్లో రాళ్లు సేకరిస్తున్న బద్వేల్ వాసులు

పామూరు: మండల కేంద్రమైన పామూరు నెల్లూరురోడ్డు 565 జాతీయ రహదారి సమీపంలో ఉన్న మదన వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూముల్లో బద్వేల్‌కు చెందిన కొందరు సోమవారం రంగురాళ్ల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా మొత్తం 12 మంది ఆయా ప్రాంతంలో రాళ్లను సేకరిస్తున్నారు. కాగా తాము సేకరించిన రాళ్లను నాణ్యతా ప్రమాణానికి పంపనున్నట్లు తెలిపారు. దీంతో పామూరులో ఒక్కసారిగా కలకలం రేగింది.

బాహాబాహీకి దిగిన తెలుగు తమ్ముళ్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్:

మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమం సందర్భంగా తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. వివరాల్లోకి వెళితే.. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వీరభోగ వసంత రాయుడు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లోని దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం కొండపికి చెందిన ఇద్దరు నేతలు గతంలో జరిగిన విషయంలో మనస్పర్థలతో బాహాబాహీకి దిగారు. గతంలో ఈ ఇద్దరూ ఒక విషయంపై మంత్రి స్వామి వద్ద పంచాయితీ నిర్వహించారు. ఆ పంచాయితీని స్వామి మధ్యవర్తిత్వంతో తీర్చారు. అది అప్పటికి సమసిపోయినట్లు కనిపించినా సోమవారం మరోసారి ఇద్దరూ గొడవకు దిగారు. విషయం పెద్దదిగా మారడంతో కొండపి పంచాయతీలోని ఒక నాయకుడు జోక్యం చేసుకొని సర్దిచెప్పి పంపారు.

భౌ భౌ భయపెడుతోంది..!

- కుక్కలతో బెంబేలెత్తుతున్న కొండపి ప్రజలు
- ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు
- వాహనాల వెంటపడుతూ హడలెత్తిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



స్టేట్ బ్యాంక్ సమీపంలో వీధిలో గుంపులుగా ఉన్న కుక్కలు



తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రాత్రి వేళలో భారీ సంఖ్యలో ఉన్న కుక్కలు

కొండపి: నియోజకవర్గ కేంద్రమైన కొండపిలోని కుక్కల దెబ్బకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా ఉండడంతో మహిళలు, చిన్నారులు నడిచి వెళ్లేందుకు హడలిపోతున్నారు. దీంతో చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటే జంకే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంపులు గుంపులుగా కుక్కలు..

నియోజకవర్గమైన కేంద్రంలో ఏ వీధిలో చూసినా కుక్కలు ఐదు నుంచి పది వరకు గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. మెయిన్ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో దాదాపు 25 కుక్కలు ఒకే చోట ఉండడంతో ప్రజలు హడలిపోతున్నారు. రాత్రిళ్లు అధిక శాతం కుక్కలు వీధుల్లో మెయిన్ రోడ్డులో హల్చల్ చేస్తున్నాయి. కొండపిలో ఏ వీధిలో చూసుకున్నా కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. నూతనంగా నిర్మించే భవనాలు ఎత్తు తక్కువ ఉన్న ప్రహరీ గోడలు దూకి ఇంటి మీదకు కుక్కలు వెళుతున్నాయని గృహ యజమానులు వాపోతున్నారు.

వాహనదారులు, పాదచారుల బెంబేలు

కొండపిలో కుక్కల దెబ్బకు వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తుతున్నారు. ఉదయాన్నే నిద్ర లేచి వాకింగ్‌కి వెళ్లడానికి వాకర్లు రోడ్డు మీదకి వస్తుంటారు. ఆసమయంలో కుక్కలు గుంపులుగా ఉండి ఒంటరిగా వెళ్లే వారి వెంటపడుతున్నాయని, అవి ఏం చేస్తాయో అని భయాందోళనతో వాకింగ్ కూడా వెళ్లడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రాత్రిళ్లు ద్విచక్ర వాహనం కనిపిస్తే చాలు వెంటపడి ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో రాత్రిళ్లు ద్విచక్రవాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇటీవల స్థానిక పాత సచివాలయం వీధిలో రోడ్డుమీద నడుస్తున్న ఒక చిన్నారిని కుక్కలు గాయపరిచాయి. ఆ సందర్భంలో గాయాలు కావడంతో బాలుడని స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యాన్ని అందించారు. మండలంలో అనేక ప్రాంతాలలో కుక్కలు కలిసి గాయాల పాలైన వ్యక్తులు చాలామంది ఉన్నారు.

పట్టించుకోని అధికారులు

కొండపిలో ఏ వీధిలో చూచినా పదుల సంఖ్యలో కుక్కలు దర్శనమిస్తున్నాయి. మొత్తం మీద మండల కేంద్రంలో 300 వరకు కుక్కలు ఉన్నాయని గ్రామస్తులంటున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా మాకెందుకే అన్నట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.



ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

వాహనాల వెంబడి పడుతున్నాయి



రాత్రిళ్లు ప్రయాణిస్తుంటే కుక్కలు వాహనాల వెంట పడుతున్నాయి. కుక్కల భయంతో అనేకమంది ద్విచక్ర వాహనదారులు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రతి వీధిలో దాదాపు పది కుక్కల వరకు సంచరిస్తున్నాయి. వాకర్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి కొండపి ప్రజలకు కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– ఏడుకొండలు

నారాయణను పరామర్శించిన దద్దాల



నారాయణను పరామర్శిస్తున్న దద్దాల, ఇతర నేతలు

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురంకు చెందిన పార్టీ నాయకుడు జిలకర నారాయణ ఇటీవల కాలు ఆపరేషన్ చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి జిలకర నారాయణ ఇంటికి వెళ్లి పరామర్శించి చికిత్స కారణాలు తెలుసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తవహించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, పార్టీ యూటీసీ జిల్లా అధ్యక్షుడు మిితికాల గురవయ్య, మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజ్, మేకల బాలు యాదవ్, కటికల వెంకటరత్నం, ఎస్.ఏడుకొండలు, పి.ఆదినారాయణ, షేక్.ఫకృద్దీన్, షేక్.గౌస్‌బాషా, పులి రామిరెడ్డి, అంబాల శేఖర్‌రెడ్డి, యనమల నాగరాజు, షేక్.ఖాజా, గురు రాజబాబు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పొన్నలూరు: ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలు పొందడం వలన రైతులకు మేలు జరుగుతుందని ఏఓ రాము అన్నారు. పొన్నలూరులో సోమవారం ప్రకృతి వ్యవసాయం, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి పంటలు సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. ఎల్‌టీ మందాకిని, జ్యోత్స్న, పి. ఏడుకొండలు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

కొండపి: ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలకు మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జి రంజిత్ అన్నారు. మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన యూనిట్లలో ఏటీఎం మోడల్ ద్వారా పండించిన పంటలను విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. ఐసీఆర్పీలు గౌతమి, తిరుమల, మాలకొండయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



మాలకొండాపురం నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పామూరు: ప్రభుత్వం ప్రతిపాదిత నిమ్జ్ భూముల్లో పరిశ్రమలు తక్షణం ఏర్పాటు చేయాలని, లేకుంటే ఆ భూములను సాగుకు ఆమోదయోగ్యంగా మార్చి పేదలకు పంపిణీచేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కొంకణాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని నిమ్జ్ ప్రతిపాదిత భూములను సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన కనిగిరికి పరిశ్రమలు వస్తేనే పేదల జీవితాలు మెరుగుపడతాయన్నారు. ఈప్రాంతానికి చెందిన వారు ఎందరో నిరుద్యోగులు ఉద్యోగావకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారని, వలసలు నివారించేందుకు తక్షణం పరిశ్రమలు స్థాపించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు సాధ్యం కాకపోతే పేదలకు పంపిణీ చేయాలన్నారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, సీపీఎం పామూరు మండల కార్యదర్శి కే.మాల్యాద్రి, యాటా వీరనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో కాలనీల్లో సీసీ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రాధాన్యతగా చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని శివనగర్ కాలనీ, 2వ వార్డు తదితర ప్రాంతాల్లో సోమవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. దీంతో చైర్మన్ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కనిగిరిరూరల్: ప్రభుత్వం నిర్వహించే వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చింతలపాలెంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

అధికార పార్టీ ఒత్తిడితోనే కూల్చారు



ఇంటి ముందు రూమ్‌ను కూల్చుతున్న దృశ్యం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తననే మూడేళ్ల క్రితం నిర్మించుకున్న తన ఇంటి ముందు రూంను ఉద్దేశ పూర్వకంగా కూల్చారని అడ్డరోడ్డుకు చెందిన అట్లా సంజీవిరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని అడ్డరోడ్డులో వంగపాడుకు వెళ్లే దారిలో తనతో పాటు అనేక మంది గృహాలు, రూమ్‌లు, రేకుల షెడ్లు వగైరా రోడ్డు పక్కన నిర్మించుకున్నట్లు చెప్పాడు. అయితే అర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు వెడల్పు చేసి సీసీ రోడ్డును వేశారు. రోడ్డు వేసినా కూడా తన ఇంటి ముందు నిర్మించుకున్న చిన్నపాటి గదికి ఎటువంటి కలగలేదన్నారు. అయితే రెండు రోజుల తర్వాత కొందరు అధికార పార్టీ నేతల వత్తిడితో ఆర్‌అండ్‌బీ అధికారులు తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తన ఇంటి ముందున్న రూంను పడగొట్టారన్నారు. అధికార పార్టీ నేతలు కక్ష సాధింపుచర్యలో భాగంగా కూల్చివేశారని వాపోయాడు. దీంతో రూ.3 లక్షలకు పైగా నష్టంవాటిల్లిందని తెలిపాడు.

ఐద్వా ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా

కనిగిరిరూరల్: మాచవరంకు చెందిన గురవమ్మ పై హత్యాయత్నానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన ప్రకాశంను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ 45 రోజులైన నిందితున్ని అదుపులోకి తీసుకోకపోవడం పట్ల పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా మండిపడ్డాడు. ఐద్వా నాయకురాలు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ బాధితురాలు గురవమ్మను నమ్మించి ఆమె వద్ద ఉన్న 13 సవర్ల బంగారం, రూ.10 లక్షల నగదును తీసుకున్నాడన్నారు. అవి ఇవ్వమన్నందుకు దాడికి పాల్పడటం, హత్యాయత్నానికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. సంఘాల నాయకులు షమీలా, ఆదిలక్ష్మీ, లాల్‌బీ, రమణమ్మ, టోపి వలి, చెన్న కేశవులు, కాశయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుతున్న పొగాకు కనిష్ట ధరలు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కనిష్ట ధరలు రోజురోజుకు దిగజారుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేలం ప్రారంభంలో గరిష్ట ధర రూ.280కి కొనుగోలు చేసి వేలం చివర దశకు వచ్చేసరికి కేజీ రూ.346 పెంచారు. రైతుల దగ్గర ఎక్కువ బేళ్లు ఉన్న సమయంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి తక్కువ బేళ్లు ఉన్న సమయంలో ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. నాణ్యమైన పొగాకును గతంలో తక్కువకు కొనుగోలు చేయడం వల్ల నష్టపోయామని, ఇప్పుడు కనిష్ట ధరలు కూడా తగ్గించుకుంటూ పోతూ కేజీ రూ.94 తీసుకువచ్చారని రైతులు వాపోతున్నారు. సరైన ధరలు లేక తీవ్ర నష్టాల్లో ఉన్నామని తెలిపారు. సోమవారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.94 పలికిందని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1179 బేళ్లను వేలానికి తీసుకురాగా 932 బేళ్లను కొనుగోలు చేసి వివధ కారణాలతో 256 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.245.73గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

అనుమతి మేరకే సాగు చేయండి



వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్

కనిగిరిరూరల్: పొగాకు రైతులు అనుమతి మేరకే సాగు చేయాలని బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ బ్యారన్‌కు 3665 కేజీలు మాత్రమే ఉత్పత్తి చేసి మంచి ఆదాయం పొందాలన్నారు. ఇతర దేశాల్లో తక్కువ ఖర్చుకే నాణ్యమైన పొగాకును సాగు చేస్తున్నట్లు చెప్పారు. కంపెనీలు ఇతర దేశాల వైపు మొగ్గు చూపుతున్న కారణంగా పొగాకు పంటలో నియంత్రణ పాటించి, నష్టాలు పాలు కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వేలం నిర్వాహణ అధికారి బండి కోటేశ్వరరావు, ఫీల్డ్ అధికారి అనిత, క్షేత్ర సహాయక సిబ్బంది, పొగాకు రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

సీఎస్‌పురం: మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా వి.ప్రతాప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా కొలిపర్ల డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై సీఎస్‌పురం ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన ఎల్.బ్రహ్మయ్య, పీఎస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి ఘనంగా సన్మానించారు

బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వీసీపల్లి: మండలంలోని దివాకరపురం ప్రాంతంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టి స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివాకరపురంలోని రిలయన్స్ కంపెనీకి బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన భూములను వ్యవసాయ కార్మిక సంఘం బృందం సోమవారం పరిశీలించారు. కంపెనీకి భూములు కేటాయించి ఆరు నెలలవుతున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కోట్ల విలువైన భూములను కట్టబెడితే..వాటిని తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకోవడం తప్ప పరిశ్రమలు పెట్టడం లేదన్నారు. దివాకరపురం, వెంగళాయపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ పరిశ్రమ ఏర్పడితే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెంటనే పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమా..డ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొమ్మాలపాటి మాల్యాద్రి, యాటా వీరనారాయణ పాల్గొన్నారు.

బాల త్రిపుర సుందరీదేవి నమోస్తుతే..!



కామేపల్లి పోలేరమ్మ తల్లి



పామూరులో వాసవీమాత



దత్త పీఠంలో బాల త్రిపుర సుందరీదేవిగా..



బాల త్రిపుర సుందరీ దేవిగా వల్లూరమ్మ తల్లి



భైరవకోనలో విశిష్ట అలంకరణలో త్రిముఖ దుర్గాదేవి మూల విగ్రహమూర్తి



బాలత్రిపురసుందరీ దేవి అలంకరణలో త్రిముఖ దుర్గాదేవి



నాగిరెడ్డిపాలెంలో బాల త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

పామూరు: దసరా శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పామూరులో ఆర్యవైశ్య కులదేవత వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంతో పాటు మహాలక్ష్మమ్మ, సాయిబాబా, మదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, వల్లీ సమేత భుజంగేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నరు. శరన్నవరాత్రి వేడుకల ప్రారంభం సందర్భంగా అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్‌శర్మ వేదమంత్రాల నడుమ మహాగణపతి హోమం నిర్వహించారు. ఆలయాలను ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. విశ్వనాథుని సత్యనారాయణ, దేవస్థాన చైర్మన్ కోట నరసింహారావు, వైస్ చైర్మన్ మంచికంటి మధుసూదనరావు, దరిశి రాజేష్, గాథంశెట్టి గురు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని భైరవకోనలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజుల ఆధ్వర్యంలో అర్చకులు కే.వి.నరసయ్య, కే.సుధాకర్, పంచాగ్నుల రామమూర్తి, జి.కే.సుధాకర్‌శర్మలు వేదమంత్రాలతో త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలబైరవేశ్వర, నగరేశ్వరస్వామివారికి విశిష్టపూజలు, అభిషేకం చేశారు. అనంతరం చండీహోమం నిర్వహించారు. త్రిముఖ దుర్గాదేవి మొదటిరోజు బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యలూరివారిపల్లెలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతిరుమలనాథస్వామి ఆలయంలో, సీఎస్‌పురంలోని కామాక్షీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో, రాచూరి పెద్దమ్మ ఆలయంలో అర్చకులు విశిష్ట పూజలు నిర్వహించి చేశారు.

కనిగిరిరూరల్: శరన్నవరాత్రి వేడుకలు ఘనంఘా ప్రారంభమయ్యాయి. స్థానిక గార్లపేట రోడ్డులో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో దసరా బ్రహ్మోత్సాలు పురస్కరించుకుని ధ్వజారోహణం, గరుడాళ్వారు పూజ, స్వామి పల్లకిసేవ, ప్రత్యేక పూజలు ఎంతో నియమ నిష్టలతో జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. శివనగర్ కాలనీలో దత్తపీఠంలో అమ్మవారు బాల త్రిపుర సుందరదేవి రూపంలో దర్శనమిచ్చారు. మాజీ ఎంపీటీసీ పచ్చవ చంద్ర శేఖర్, సుజాత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. నందనమారెళ్లలోని కొండపైన ఉన్న టేశ్వర స్వామి దేవ స్థానంలో విశిష్ట పూజలు చేశారు.

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ తల్లి దేవస్థారంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పొన్నలూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలుచ ఏశారు. మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.